# కథాకేళి



## మల్లాదివెంకటకృష్ణమూర్తి

## బ్యూరోక్రసీ

ఎప్పటిలా ఎన్నికలొచ్చాయి. వెళ్ళాయి. అయితే ఈసారి ఎంతో మార్పు. అందుక్కారణం ఎప్పుడూ గెలవని ఓ పార్టీని ప్రజలీసారి గెలిపించారు.

కొత్త వాగ్దానాలతోపాటు, కొత్త ముఖ్యమంత్రి వచ్చాడు. కొత్త మంత్రివర్గంవచ్చింది. అంతా కొత్త.

ఆ పార్టీ మేనిఫెస్టోలోని మొదటి అంశం ప్రభుత్వ కార్యాలయాల్లో, పని విషయంలో జరిగే జాప్యాన్ని తగ్గించడం.

మంత్రివర్గం తమ మొదటి సమావేశంలో ఈ విషయం గురించే చర్చించింది. ప్రయివేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తమ పనిని చకచకా చేసుకుపోతూంటే, ప్రభుత్వోద్యోగులు మందకొడిగా ఎందుకు పనిచేస్తారు? ఫైళ్ళ నత్త నడకకి కారణాలేమిటి?

ముందర కారణాలని కనిపెడితే, ఆ సమస్యని తేలికగా పరిష్కరించుకోవచ్చనే నిర్ణయం తీసుకున్నారు.

"సోదరులారా అసలు రోగం మనకి అర్థమయితే, చికిత్సకి మందు కనిపెట్టగలం. ఈ విషయమై శక్తి వంచన లేకుండా కృషి చేద్దాం" చెప్పాడు ముఖ్యమంత్రి ఆ సమావేశం చివరలో

మళ్ళీ మరో మూడు వారాల తర్వాత సమావేశమై, ఆ అంశం గురించి మరోసారి ముచ్చటించాలని కూడా అనుకున్నారు. ప్రతి మంత్రి తన మంత్రిత్వ శాఖలోని కార్యాలయాల్లో పని విషయంలో జరిగే ఆలస్యానికి కారణం కనుక్కోడానికి చర్యలు తీసుకున్నారు.

ఆ సమస్యని స్టడీ చేయడానికి ఓ కమీషన్ని వెంటనే ఏర్పాటు చేశారు ప్రతీ మంత్రి. ఆ కమీషన్లో పని చేయడానికి సభ్యులని ఎన్నిక చేశారు వారికింద పనిచేయడానికి ఎంతమంది ఉద్యోగస్థులు కావాలో ఓ కమిటీ అంచనా తయారుచేసింది. ఆ ఉద్యోగస్థులనికొత్తగా ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ నించి నియమించాలా లేక మంత్రిత్వ శాఖల్లోని వివిధ కార్యాలయాలనించి తీసుకోవాలా ఆలోచించిందా కమిటీ. కొత్త వాళ్ళని వద్దనుకున్నారు, పొదుపు నిమిత్తం.

ఏఏ శాఖల్లోంచి ఎంతెంత మందిని తీసుకోవాలి? అదీ నిర్ణయించిందా కమిటీ. అలా తీసుకునే ఉద్యోగస్థులని బదిలీ చేయాలా లేక డెప్యుటేషన్ మీద పంపాలా అనే ప్రశ్న తలెత్తింది. కమిషన్ తాత్కాలికం కాబట్టి డెప్యుటేషన్ బెటరనుకున్నారు

డెప్యుటేషన్ మీద తీసుకునే ఉద్యోగస్థుల కనీస అర్హతలేమిటి అనే మరో సమస్య వచ్చి పడింది. ఓ బుల్లి కమిషన్ 'పదేళ్ళ సర్వీస్ చాలు' అని చేసిన సిఫారసును ప్రభుత్వంఅంగికరించింది. పదేళ్ళపైబడ్డ సర్వీస్ గలవాళ్ళు వేలల్లో ఉన్నారు. మరి వాళ్ళలోంచి ఎలా ఎన్నుకోవడం? ఈ సమస్యని పరిష్కరించడానికి మరో బుల్లి కమిషన్ని నియమించింది ప్రభుత్వం... *

